మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు
- అధికారంలోకి వచ్చాక తూట్లు
- చంద్రబాబు మోసాన్ని ఇంటింటికి వెళ్లి వివరించండి
- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి


బోయలకుంట్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రనాథ్‌రెడ్డి


జీనేపల్లెలో సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

శిరివెళ్ల: మోసాలు, అబద్ధాలకు చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడరని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోయలకుంట్ల, జీనేపల్లెలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బాబు ఇచ్చిన హామీలు అమలు ఎలా ఉందంటే ఏరు దాటే వరకు ఎల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లుందని విమర్శించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ హామీలను అమలు పరుస్తామన్నారు. ఏడాది గడిచినా ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. కొత్త పింఛన్లు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ఒక్కో కుటుంబం ఏడాదికి రూ. లక్ష దాకా నష్టపోయిందన్నారు. చంద్రబాబుకు ప్రజలపై ప్రేమ ఉండదన్నారు. గతంలో కూడా ఆయన ప్రజలకు మేలు చేసింది లేదన్నారు. తమ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూటమి సర్కారుపై ఒత్తిడి పెంచడంతో ఈ ఏడాది తూతూ మంత్రంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. మొదటి ఏడాది వందనానికి తిలోకాలు ఇచ్చినట్లేన్నారు. ఉచిత గ్యాస్ డబ్బులు ఇంత వరకు సక్రమంగా ఎవ్వరికి అందలేదన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలు రాష్ట్రంలో కోటి మంది ఉన్నారన్నారు. వారికి ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ. 1500 చొప్పున ఇస్తామని కూటమి సర్కారు మాట ఇచ్చిందన్నారు. అయితే, ఇప్పటి వరకు అతీగతీ లేదన్నారు. అలాగే ఏడాదికి లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు..మరి ఆ ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో చంద్రబాబును చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన కూటమి సర్కారు కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. బాబు దగాపై నిరుద్యోగులు, యువకులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్ హామీలు వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయన్నారు. ఇళ్ల స్థలాల కోసం పేదలు, పింఛన్ల కోసం వితంతువులు, వికలాంగులు, వృద్ధులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. పథకాల అమలు ఎప్పుడు అని ప్రశ్నిస్తే దాడులు చేస్తూ, కేసులు పెడుతూ వేధిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. దమ్ముంటే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలాగా ఎన్నికల హామీలు అమలు చేసి చూపించాలన్నారు. కూటమి సర్కారు హామీల అమలు చేసే వరకు ప్రజల పక్షాన తాము పోరాడుతామని చెప్పారు. ఇంటింటికి వెళ్లి బాబు మోసాలను వివరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రైతన్న పరిస్థితి దయనీయం

రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. జగనన్న పాలనలో రైతు ఎంతో సంతోషంగా ఉండేవారని చెప్పారు. ఇప్పుడు గిట్టుబాబు ధర లేదు..సబ్సిడీ విత్తనాలు లేవు, ఉచిత పంటల బీమా లేదన్నారు. ఇలా ప్రతిదానిని కూటమి సర్కారు అటకెక్కించిందని మండిపడ్డారు. పంటలకు ధర లేక రోడ్లపై పారేసుకుంటున్నారన్నారు. తమ పాలనలో వరి ధాన్యం బస్తా రూ. 2 వేలు అమ్మితే నేడు రూ. 1300కు వ్యాపారస్తులు అడగడంలేదన్నారు. నమ్మించి మోసం చేసిన కూటమి సర్కారుకు త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కుల మతాలు, వర్గాలను చూడకుండా ఆళ్లగడ్డ టీడీపీ నాయకులు దోచుకుంటూ తమ జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ యూత్ ప్రెసిడెంట్ పలచాని మల్లికార్జునరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, సర్పంచులు జింకల నాగన్న, దగడ రాజారెడ్డి, రఘునాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బి. అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం , పరిషత్ ఉపాధ్యక్షురాలు చీమల అనూష, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహనీయులకు నివాళి


మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్‌రెడ్డి

దొర్నిపాడు: స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి వేడుకలను స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఆపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గ యూనిట్ అధ్యక్షుడు అమీర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమరయోధుల చిత్రపటాలకు మండల విద్యాధికారి మనోహర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రామచంద్రయ్య, కరస్పాండెంట్ గిరి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక పక్షాన పోరాటం


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గోస్పాడు: సీపీఐ కార్మిక, కర్షకుల పక్షాన పోరాటం చేస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమన్న అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడులో ఏపీ రైతు సంఘం, సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలానీబాషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. తొలి నుంచి అణగారిన పీడిత, కార్మిక, కర్షక ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటూ వారి సమస్యలపై అలుపెరిగిన ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం ఈనెల 30,31 తేదీల్లో జరిగే మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలి


చిన్నవంగలి ప్రాథమిక పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు


చాగలమర్రి: ఉపాధ్యాయులకు సంబంధించిన సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు డి.మౌలాళి డిమాండ్ చేశారు. బుధవారం ఆ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. చాగలమర్రిలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారినా ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గలేదన్నారు. బోధనేతర పనులు నేటికి కొనసాగుతున్నాయని, దీని వలన విద్యాబోధన కుంటు పడుతుందన్నారు. 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జి. ఆంజనేయరెడ్డి, జిల్లా నాయకులు హరినాథ్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, షాకీర్, రవి శంకర్‌రెడ్డి, దస్తగిరి, సుబ్రమణ్యం, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్య పౌడర్ ప్యాకెట్ల సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న సౌభాగ్య పౌడర్ ప్యాకెట్లు

కోవెలకుంట్ల: నిషేధిత సౌభాగ్య పౌడర్ ప్యాకెట్లు విక్రయించే కిరాణాషాపులపై బుధవారం సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. సుమారు 300 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన కెమికల్ పదార్థాలు ఉండటంతో పౌడర్‌ను నిషేధించినా పలు షాపుల్లో విక్రయాలు జరుపుతుండటంతో దాడులు జరిపారు. అనంతరం సీజ్ చేసిన ప్యాకెట్లను కాల్చివేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిషేధిత సౌభాగ్య పౌడర్ ప్యాకెట్లను విక్రయించవద్దన్నారు. వ్యాపారులు అమ్మకాలను కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలరించిన హరికథాగానం



హరికథాగానం వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై కర్నూలుకు చెందిన వై.సీతారామరాజు భాగవతార్.. భూకై లాస్ హరికథాగానం నిర్వహించారు. తబలా సహకారాన్ని ఎం.వెంకటేష్, హార్మోనియం సహకారాన్ని వై.జగదీష్ అందించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి


రూపనగుడిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఉయ్యాలవాడ : పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రూపనగుడి, మాయలూరు గ్రామాల్లో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రాప్ నమోదు చేయడం వల్ల బీమాతో పాటు దిగుబడులు విక్రయించుకునేందుకు ప్రభుత్వ రాయితీలు పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. అంతకు ముందు రైతులతో కలిసి మొక్క జొన్న సాగు చేసిన పంటను పరిశీలించి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సునిత, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

రుద్రవరం: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలకు రసాయన ఎరువులు వినియోగించాలని రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య రైతులకు సూచించారు. మండల పరిధిలోని తిమ్మనపల్లెలో బుధవారం జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య, ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ శేఖర్ ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన పథకంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులు, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించే విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సమీపంలో సాగు చేసిన వరి పొలం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓలు వెంకటేశ్వరెడ్డి, సుమతి, ఏఈఓలు రాజు, పహిమా తబస్సుం, వీఏఏలు జయకృష్ణ, విజయ రాణి ఉన్నారు.

లయన్స్ క్లబ్ జిల్లా ప్రాంతీయ ఛైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డి

నంద్యాల (వ్యవసాయం): లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లాల ప్రాంతీయ ఛైర్మన్‌గా నంద్యాల లయన్స్ క్లబ్‌కు చెందిన పీవీ సుధాకర్ రెడ్డిని ఎంపిక చేశారు. సుధాకర్ రెడ్డి గత సంవత్సరం జోనల్ ఛైర్మన్‌గా, 2023–24 సంవత్సరంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చేసిన విశేష సేవలను గుర్తించి ప్రాంతీయ ఛైర్మన్‌గా ఎంపిక చేసినట్టు లయన్స్ గవర్నర్ ఇల్లూరి గోపాలకృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. నూతన ప్రాంతీయ ఛైర్మన్‌కు ఆంధ్రప్రదేశ్ లయన్స్ క్లబ్‌ల సమాఖ్య మాజీ ఛైర్మన్ ఏవీఆర్ ప్రసాద్, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ సహదేవుడు, ఆడిటర్ వంకదారి గోపాల్, భవనాసి నాగ మహేష్, కొట్టె చంద్రశేఖర్, రవి ప్రకాష్, శ్రీకాంత్, ఎంపీవీ రమణయ్య, బైసాని రమేష్, మనోహర్ రెడ్డి, రవీంద్ర, అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్దన్ అభినందనలు తెలిపారు.

యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


రుద్రవరంలో దుకాణాదారులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

రుద్రవరం: యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్ అన్నారు. మండల కేంద్రం రుద్రవరం వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిర్దేశించిన ధరలకే విక్రయించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని చెప్పారు. స్టాక్ బోర్డులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమతి, ఏఈఓలు రాజు, పహిమా తబస్సుం ఉన్నారు.

అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు వాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గోస్పాడు: పంటల సాగులో రైతులు అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులను వాడాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సరళమ్మ అన్నారు. బుధవారం మండలంలోని జిల్లెల్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము, సోయాబీన్ పంటల్లో రైతులు సరైన సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రసాయన ఎరువులు విచక్షణ రహితంగా వాడరాదని, మోతాదును అనుసరించి వాడాలని సూచించారు. సకాలంలో చీడపీడలు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లేకపోతే నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హేమసుందర్ రెడ్డి, ఏఈఓలు రామకృష్ణ, నాగార్జున, అగ్రికల్చర్ అసిస్టెంట్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ సభ


వేదికపైకి పిలువకపోవడంతో నిల్చున్న వైస్ ఎంపీపీ ఆశీర్వాదమ్మ

చాగలమర్రి: ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సభ బుధవారం తూతూ మంత్రంగా సాగింది. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా రికవరీ ఉంది. మండలకేంద్రం చాగలమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన 19వ సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా డ్వామా పీడీ సూర్యనారాయణ హాజరయ్యారు. ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన 2005 పనులకు రూ. 9.84 కోట్లు ఖర్చు చేయగా రూ.50,505 నిధులు దుర్వినియోగమైనట్లు డీఆర్పీలు సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారులు అన్వరా బేగం, షీబా, పశు వైద్యాధికారి సాయిబాబా, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, ఎస్ఆర్‌పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ విస్మరించిన అధికారులు

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ప్రోటోకాల్ పాటించకుండా దళిత వైస్ ఎంపీపీ ఆశీర్వాదమ్మను అధికారులు అవమానించారు. ఆమెను స్టేజ్‌పైకి అధికారులు పిలవకపోవడంతో కొద్ది సేపు నిరీక్షించి ఇంటికి వెళ్లిపోయారు. సమావేశానికి ఆహ్వానించి ఇలా అవమానించడం సరికాదని చెప్పారు. ఎలాంటి హోదా లేని అధికారపార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

'ఆడబిడ్డ నిధి' అమలు చేయాల్సిందే


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాల్సిందేనని మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిషా అన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని మాట ఇచ్చారన్నారు. ఇప్పుడు ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిందేనని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం సిగ్గుచేటన్నారు. హామీ ఇచ్చేటప్పుడు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. బుధవారం స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోతే చంద్రబాబుకు మహిళలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నాడు వైఎస్సార్సీపీ ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పరని చెప్పారు. రాష్ట్ర వైఎస్సార్సీపీ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ డా. శశికళారెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసిందన్నారు. ఇందుకు ఆయనపై చీటింగ్ కేసులు పెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏఏ హామీలు ఇచ్చిందో వాటన్నింటినీ అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు గొల్లవెంకటలక్ష్మి, శిరీష, కోఆప్షన్ సభ్యురాలు శోభారాణి, మాజీ కౌన్సిలర్ లు కన్నమ్మ, ఉషేనమ్మ, మహిళలు పాల్గొన్నారు.

సాధ్యం కానప్పుడు హామీ ఎందుకిచ్చారు?

ఏపీని అమ్మితే తప్ప ఆడబిడ్డ నిధికి నిధులు ఇవ్వలేమని చెబుతున్న టీడీపీ నాయకులు ఎన్నికలో ఆ హామీని ఎందుకిచ్చారో చెప్పాలని మునిసిపల్ కౌన్సిలర్ అనూష డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఏవైతే వాగ్దానాలు ఇచ్చిందో వాటిని అమలు చేసేదాక తమ పోరాటం ఆగదన్నారు. అధికారం కోసం నాడు చంద్రబాబు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు.

శ్రీశైలంలో విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం , కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

3న బహుజనుల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(న్యూటౌన్): ఆగస్టు 3వ తేదీన అనంతపురంలో బహుజన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆర్‌పీఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్ తెలిపారు. బుధవారం నంద్యాలలో బహుజన రిజర్వేషన్ల ఎంప్లాయీస్ ఫెడరేషన్ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. రాజకీయ పార్టీల సామాజిక న్యాయం కేవలం ప్రకటనలకే పరిమితమన్నారు. 56శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 44శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం సమీపంలో దస్తగిరి అనే వ్యక్తి మోటర్ సైకిల్ మీద నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు టి.లింగందిన్నెకు చెందిన ఆ వ్యక్తి బుధవారం మోటర్ సైకిల్‌పై ఆళ్లగడ్డకు వెళ్లి అక్కడ వ్యక్తిగత పనులు పూర్తి కాగానే ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు.నర్సాపురం దాటాక మోటర్ సైకిల్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వారు తెలిపారు.

వ్యక్తిపై దాడి

నంద్యాల(అర్బన్): గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన ప్రసాదరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసాదరెడ్డి బుధవారం ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి జొరబడి దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో ఇంట్లోని ఫర్నిచర్ ధ్వంసమైందని, పోలీసుల సహకారంతో ప్రసాదరెడ్డిని ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై రూరల్ సీఐ ఈశ్వరయ్య వివరణ కోరగా తనకు ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

కవి రామకృష్ణారెడ్డికి పురస్కారం

నంద్యాల (వ్యవసాయం): విజయవాడలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో నంద్యాల యువకవి పి. రామకృష్ణారెడ్డికి మల్లెతీగ సంస్థ ఆత్మీయ పురస్కారం అందజేసింది. తాను రచించిన ×నీ పేరే రాస్తాను స్వాతంత్ర్యమా!₹ అనే కవితా గానానికి పురస్కారం దక్కినట్లు రామకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెనూ పాటించకపోతే చర్యలు


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: విద్యార్థులకు ఆహార పదార్థాల వడ్డింపులో మెనూ పాటించకపోతే ఉపేక్షించేది లేదని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్ కుమార్, జీసీడీఓ నాగ సువర్చల హెచ్చరించారు. బుధవారం వారు మండల కేంద్రంలోని గోస్పాడు కేజీబీవీ పాఠశాలను తనిఖీచేశారు. విద్యార్థులకు పాఠశాలలో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు సరిగ్గా లేవని తెలియడంతో సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. అలాగే పాఠశాలలో మరగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బోధనా, బోధనేతర సిబ్బందితో విడివిడిగా సమావేశం జరిపి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల వెంట ఎంఈఓ అబ్దుల్ కరీం, సీఆర్‌పీ నాగరాజు ఉన్నారు.


రామలింగేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

వర్షం కురవాలని..

చాగలమర్రి: వర్షం కురవాలని మండల కేంద్రం చాగలమర్రిలోని చిన్నమకానంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి 108 బిందెలతో జలాభిషేకం చేసి వరుణ యాగం చేపట్టారు. మండల పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్, విత్తన దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు ఆదవేని రవికుమార్, ఉపాధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా శివుడికి గణపతి పూజలు నిర్వహించి వరుణ యాగం చేశారు. పాడిపంటలతో మండలం కళకళలాడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఏఓ రంగనేతాజి, ఏఈఓలు మంజుల, రేవతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు సల్లా నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, సభ్యులు దస్తగిరి, రాజశేఖర్, బ్రహ్మయ్య, షరీఫ్, గోపాల కృష్ణ, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థానంలో జరిగిన హుండీ చోరీ కేసులో నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26వ తేదీ ఎగువ అహోబిలం దేవాలయంలో సిబ్బంది కొందరు హుండీ దొంగతనానికి పాల్పడినట్లు దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనపై విచారించి అందులో ఉద్యోగం చేస్తున్న అరిగెల నరసింహ, రంపాల సుబ్బరాయుడు, కరణం నిరంజన్, నెమ్మికంటి పోతులూరయ్య అనే నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 82 వేలు నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

దారంతా ఛిద్రమే


గుంతల మయంగా దొర్నిపాడు- ఉయ్యాలవాడ రోడ్డు

దొర్నిపాడు: దొర్నిపాడు- ఉయ్యాలవాడ ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతినింది. అడుగడుగునా గుంతలు పడి ఉండటంతో రాకపోకలు ఎలా కొనసాగించాలని ప్రశ్నిస్తున్నారు. 13 కిలోమీటర్ల పొడవునా గతుకులే ఉండటంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నంద్యాల నుంచి దొర్నిపాడు మీదుగా ఉయ్యాలవాడ వరకు బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం రోడ్డు సరిగ్గా లేక పోవడంతో ఆర్టీసీ అధికారులు ఆ రోడ్డులో బస్సు తిప్పడానికి సాహసం చేయలేకపోతున్నారు. ముఖ్యంగా ఈ దారిలో రైతుల పొలాలు అధికంగా ఉన్నాయి. దారి బాగా లేకపోవడంతో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.